
సాక్షి ఒడిశా

మంగళవారం । 25 । జూలై । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,55,868లు, బంగారం 7.65 గ్రాములు, వెండి 27.9 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**నేటి నుంచి రాష్ట్రపతి పర్యటన**

- 8లో



**భారీ అలుగు స్వాధీనం**

- 8లో

## న్యూస్‌రీల్

### 927మందికి వైద్య పరీక్షలు



క్రిస్టియన్‌లో పరీక్షలు జరుపుతున్న వైద్యులు

జయపురం: పట్టణంలోని జగధాత్రిపూర్ ఆస్పత్రి, జయపురం ఎల్ఆర్ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో 927మందికి పరీక్షలు జరిపారు. క్రిస్టియన్‌పేట క్లబ్ ప్రాంగణంలోని రెండో హటపాదర్ మిషన్‌శక్తి కేంద్రంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, ఇతర సాధారణ వ్యాధులపై వివరించారు. శిబిరాల్లో డాక్టర్ తథాగత రథ్, డాక్టర్ సురేష్ పాణిగ్రహి, పీహెచ్ఎం సంజయ కుమార్ స్వాయి, లింగరాజ్ పాఢి, సూపర్‌వైజర్ సత్యనారాయణ పాత్రొ, ప్రణయ సాహు తదితరులు పాల్గొన్నారు.

### మణిపూర్‌పై ఆందోళనలో ఎంపీ ఉల్కా




పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్న ఎంపీ సప్తగిరి

కొరాపుట్: మణిపూర్ ఘటనపై పార్లమెంట్‌లో సోమవారం జరిగిన ఆందోళనలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కా పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి ఉల్కా ఒక్కరే హస్తం పార్టీ తరఫున లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన ఆందోళనలో భాగంగా సహచర మిత్రుడు సమీప ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ఎంపీ దీపక్ బైజ్‌తో కలిసి పాల్గొన్నారు. దీపక్ ప్రస్తుతం ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

### మాజీ స్పీకర్‌కు పరామర్శ



చింతామణి జ్ఞాన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: ఒడిశా అసెంబ్లీ మాజీ స్పీకర్ చింతామణి జ్ఞాన్ సామంతరే సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో గంజాం జిల్లా పాత్రపురం బ్లాక్ బొమ్మిక గ్రామంలోని ఆయన నివాసానికి చేరుకున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు పరామర్శించారు. పరామర్శలో బీజేపీ నాయకులు జగన్నాథ పరిడా, జి.శ్రీధరనాయుడు ఉన్నారు.

### విధుల్లోనే ఫూటుగా తాగిన ఇంజినీర్లు

- క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారుల ఆదేశాలు

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లాలో ఇద్దరు ప్రభుత్వ ఇంజినీర్లు తమ కార్యాలయంలో మద్యం సేవిస్తున్నట్లు వీడియో వైరల్ కావడంతో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ జెనా జలవనరుల శాఖను సోమవారం ఆదేశించారు. ఈ ఇరువురు నిందితులు మహానది నార్త్ డివిజన్‌లో ఇంజినీర్లుగా ఉన్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని నారాయణపూర్ సెక్షన్ కార్యాలయంలో ఇంజినీర్లు, మరికొందరు వ్యక్తులు పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో మద్యం, ఆహారం సరంజామాతో సమగ్ర వీడియో చిత్రీకరించి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో తీవ్ర కలకలం రేపింది. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో ఇరువురు ఇంజినీర్లపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని జల వనరుల శాఖను ఆదేశిస్తూ సీఎస్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- తెరుచుకున్న పూరీ శ్రీమందిరం పశ్చిమ ద్వారం
- స్థానిక భక్తులకు దర్శనాలకు అనుమతిచ్చిన పాలకవర్గం
- ఇతర ద్వారాలు కూడా తెరవాలని డిమాండ్



పూరీ శ్రీమందిరం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దర్శనానికి స్థానికుల ఎదురు చూపులకు తెరదించారు. దాదాపు మూడేళ్ల దీర్ఘకాల వెతలకు తెర దించేందుకు సమాజంలో పలు వర్గాలు ఆలయ పాలక మండలిని నిలదీయాల్సి వచ్చింది. పూరీ స్థానికులకు పశ్చిమ ద్వారం (వ్యాఘ్ర) ద్వారం మీదుగా గతంలో ప్రత్యేక ప్రవేశం కల్పించేవారు. కరోనా కారణంగా గత రెండేళ్లకు పైగా ఈ ద్వారాన్ని మూసి వేయగా, సోమవారం నుంచి ఈ సౌలభ్యం పునరుద్ధరించారు. స్థానికేతరులకు గత మూడేళ్లుగా కొనసాగుతున్నట్లు సింహ ద్వారం నుంచి దర్శనానికి అనుమతిస్తారు. పశ్చిమ ద్వారం మీదుగా దర్శనం కోసం స్థానికులు సంబంధిత ఆధారం ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ ద్వారం ప్రవేశ ప్రాంగణంలో అనుబంధ తనిఖీలు చేపట్టి, లోపలికి అనుమతిస్తారు.

**నాలుగు ద్వారాలు తెరిచేదెప్పుడో..**

జగన్నాథుడు కొలువుదీరిన శ్రీమందిరం సువిశాలం. ఆలయం ప్రవేశానికి నలువైపులా ప్రత్యేకంగా ద్వారాలు శతాబ్దాలుగా ఆచరణలో ఉన్నాయి. భక్తులు, యాత్రికులు దర్శనం కోసం వెళ్లి వచ్చేందుకు ఈ ద్వారాలు ఏర్పాటయ్యాయి. రద్దీ నియంత్రణకు దోహదపడే ఈ ద్వారాలను కోవిడ్–19 ఆంక్షలతో మూసి వేసి, కృత్రిమ రద్దీని పాలకవర్గం ప్రేరేపించింది. కరోనా పేరుతో సర్వజనులకు శ్రీమందిరం సింహద్వారం మీదుగా మాత్రమే దర్శనానికి అనుమతించడానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం వైరస్ ఆంక్షలు తొలగినా మిగిలిన 3 ద్వారాలు తెరుచుకోలేదు. దీంతో భక్తుల్లో అసంతృప్తి చెలరేగింది. శ్రీమందిరం ఆవరణలో బైఠాయించేందుకు సైతం వెనుకాడగ పోవడంతో మొక్కుబడిగా పశ్చిమ ద్వారం తెరిచేందుకు నిర్ణయించారు. అయితే స్థానికులకు మాత్రమే పరిమితం చేశారు.

**మోక్ష మార్గం..**

శ్రీమందిరం నలువైపులా ఏర్పాటైన 4 ద్వారాలు ప్రత్యేక విశిష్టత కలిగి ఉన్నాయి. ఒక్కో ద్వార ప్రవేశం ఒక్కో రీతిలో మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతి ద్వారానికి ప్రత్యేక నామకరణం చేశారు. భక్త భావోద్వేగానికి అనుగుణంగా ప్రవేశం విభజన అవాంఛనీయ రద్దీని నియంత్రించడంలో తోడ్పడుతుంది. ధార్మిక, ఆధ్యాత్మిక విలువలకు నీళ్లొదిలి పాలనపరమైన సౌకర్యానికి పట్టం గట్టడం అత్యంత విచారకరం. ప్రాచీన సర్వజన హిత కాంక్ష, లౌక్యం గుర్తెరిగి జగన్నాథ సంస్కృతి విశ్వవ్యాప్తం చేయాల్సిన అనుబంధ వర్గాలు.. భక్తజన హృదయాలను గాయపరుస్తున్నాయి. ఈ పరిస్థితులు వివిధ వర్గాలు స్వీయ లబ్ధి కోసం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యాపించడంతో అపురూపమైన జగన్నాథ సంస్కృతి పట్ల నీలిమేఘాలు అలుముతున్నారు. శ్రీమందిరం నలువైపుల ద్వారాలను తెరవడంతో ఆయా మార్గాల గుండా స్వామి దర్శనం ప్రత్యేకత సర్వభక్త జనులకు స్పష్టం చేయడం జగన్నాథ తత్వం ఆంతర్యాన్ని నిత్య నూతనంగా కొనసాగించేందుకు దోహదపడుతుందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**తాత్కాలికంగా నిలిపివేత..**

పూరీ జగన్నాథునికి ఖొసాపాడా సేవ నిర్వహించారు. స్వామి సేవల్లో క్రమం తప్పకుండా జరిగే సేవల్లో ఇది ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా శ్రావణ మాసం శుక్లపక్షం షష్టి, చైత్రమాసం కృష్ణపక్షం చతుర్దశి తిథుల్లో, ఏడాదిలో మరో 1, 2 సందర్భాల్లో మాత్రమే ఈ సేవ నిర్వహించడం సంప్రదాయం. రత్న వేదికపై మూల విరాట్‌కు అత్యంత గోప్యంగా నిర్వహించే ఈ సేవను దైతపతుల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాధారణ భక్తుల ప్రవేశం నివారించి, సర్వదర్శనం నిలిపివేశారు. నిత్యం నివేదించ ద్వితీయ భోగమండప సేవ అనంతరం ఖొసాపాడా సేవ కార్యకలాపాలు ప్రారంభించారు. ఈ సేవ కోసం దైతపతి సేవకులు సాయంత్రం 6గంటలకు శ్రీమందిరం రత్నవేదిక ప్రాంగణానికి చేరారు. రాత్రి 8.50 గంటల వరకు నిరవధికంగా సేవ కొనసాగించారు. అనంతరం అనుబంధ పూజార్చనలు ప్రారంభించారు. మూల విరాట్‌ల శ్రీఅంగ రక్షణలో భాగం కావడంతో ఖొసాపాడా సేవ ప్రాధాన్యత సంతరించుకుంది. దేవతా మూర్తుల శ్రీపాయర్ల(పవిత్ర పాదాలు) రక్షణ కోసం తెల్లని వస్త్రాలను అత్యంత జాగరూకతతో చుట్టడం ఈ సేవ విశిష్టత.



పశ్చిమద్వారం మీదుగా స్థానికులకు ప్రవేశం కల్పిస్తున్న దృశ్యం

# 242కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో పోలీసుల అదుపులో నిందితులు

- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

కొరాపుట్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 242కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మాచ్‌ఖండ్, లమతాపుట్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో 112కిలోల గంజాయి పట్టుబడింది. ముందస్తు సమాచారం మేరకు రెక్కీ నిర్వహించగా, మల్కన్‌గిరి జిల్లా పాత్రపుట్ నుంచి 5 బైక్ లపై బస్తాలతో వస్తున్న యువకులను అడ్డుకున్నారు. బస్తాను పరిశీలించగా గంజాయి బయట పడటంతో నిందితులను అరెస్ట్ చేశారు. వీరు హనుమల్‌కు చెందిన లక్ష్మణ్ మాఝి, జయంగ్‌గిరికి చెందిన దేవాశిస్, గంటిగుడకు చెందిన దేవా దురియా, మంత్రిపుట్‌కు చెందిన సోనుపంగి, భరనీపుట్‌కు చెందిన సుమిత్ ఖొరాగా గుర్తించి, అరెస్ట్ చేశారు. జయపురం మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ చిత్త ప్రధాన్, దర్యాప్తు చేస్తున్నారు.

**రూ.13 లక్షల గంజాయి స్వాధీనం**

జయపురం: పట్టణ పోలీసులు రూ.13 లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారని సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. దీనికి సంబంధించి ఒకరు పట్టుబడగా, మరో ముగ్గురు పరారయ్యారని తెలిపారు. నిందితుడు మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పంచాయతీ కుడుములగుమ్మ గ్రామానికి చెందిన నారాయణ శుక్రి(34)గా గుర్తించారు. మల్కన్‌గిరి నుంచి జయపురం మీదుగా కలహండి జిల్లాకు తరలిస్తుండగా పట్టుబడినట్లు వెల్లడించారు. విజయవాడ–రాంచీ 326 జాతీయ కారిడార్ పాత్రొపుట్ వద్ద ఎస్ఐలు ఆర్‌కే బారిక్, గౌరవ చంద్ర దాస్, పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా, పోలీసులను గమనించిన యువకులు వాహనాన్ని వదిలి, సమీపంలోని అడవిలోకి పరుగులు తీశారు. వీరిలో ముగ్గురు తప్పించుకోగా, ఒకరు పోలీసులకు చిక్కారు. కారును సోదా చేయడంతో 130కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.13 లక్షలు ఉంటుందని ఐఐసీ ప్రకటించారు. ఘటనపై కేసు నమోదు చేసి, పరారైన వారి కోసం గాలిస్తున్నామని వివరించారు.



పట్టుబడిన కారు, గంజాయితో నిందితుడు

# బరితెగించిన గంజాయి ముఠా

- ఎక్సైజ్ ఎస్ఐ సహా కానిస్టేబుల్‌పై దాడి



గాయపడిన కానిస్టేబుల్ మేఘనాథ్




గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

జయపురం: గంజాయి మాఫియాను అడ్డుకునే ప్రయత్నంలో ఇన్‌స్పెక్టర్ దుర్యోధన బిశ్వాల్ తోపాటు కానిస్టేబుల్ మేఘనాథ్ శబర తీవ్రంగా గాయపడ్డారు. వారిని కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చగా, మెరుగైన చికిత్స నిమిత్తం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే... ఒడిశా–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు కొట్‌పాడ్ సమితి మలచమాల గ్రామం సమీపంలోని ఘెుడాఘాట్ ప్రాంతంలో పెద్ద ఎత్తున గంజాయి తరలించేందుకు సిద్ధం అవుతున్నట్లు అందిన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎక్సైజ్ విభాగం అధికారులు దాడులు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ దుర్యోధన బిశ్వాల్ నేతృత్వంలో 3బృందాలు ఘెుడాఘాట్ పరిసరాల్లో వేర్వేరుగా మాటు వేశారు. ఈ నేపథ్యంలో 25మందికి పైగా గంజాయి ముఠా దుండగులు సిబ్బందిపై గొడ్డల్లు, కత్తులు, ఇనుప రాడ్లతో దాడికి దిగారు. వారి వద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపేందుకు సిద్ధం కాగా, ఎక్సైజ్ సిబ్బంది ప్రాణభయంతో పరుగులు తీశారు. ఇన్‌స్పెక్టర్ బిశ్వాల్ కింద పడిపోవడంతో చుట్టుముట్టిన దుండగులు అమానుషంగా చావబాదారు. కానిస్టేబుల్ మేఘనాథ్‌ను ఎత్తుకుపోయి, తీవ్రంగా గాయపరిచారు. అనంతరం పరాయ్యారు. మిగతా సిబ్బంది చేరుకొని, వెంటనే ఆస్పత్రికి తరలించారు. సిబ్బందిపై దాడి జరిపిన వారిలో కొందరిని గుర్తించామని కొరాపుట్ జిల్లా ఎస్పీ అరుణ పాఢి వెల్లడించారు. గతంలో ఇదే ప్రాంతంలో భారీగా గంజాయి పట్టుబడిందని, సిబ్బంది వస్తున్నారనే మాఫియాకు ముందుగా సమాచారం అందడం కారణంగానే దాడికి పాల్పడ్డారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి వెళ్లి, పరామర్శించడంతో పాటు నిందితుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

# అత్యాశకు పోయి..

- అక్రమంగా విద్యుత్ తరలించబోయి.. యువకుడి మృతి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు యువరాజ్



తీగలపై వేలాడుతున్న గణేష్ మృతదేహం

కొరాపుట్: అత్యాశకు పోయి విద్యుత్ చౌర్యం కోసం ప్రయత్నించిన యువకుడు షాక్‌కు గురై, మృతిచెందాడు. నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వంచల గ్రామానికి చెందిన గణేష్ గోండొ(30) తన ఇంటికి అక్రమంగా కనెక్షన్ ఇవ్వాలనుకొని, విద్యుత్ తీగలకు ఇనుప కొక్కెం పెట్టాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో స్తంభం పైకి ఎక్కి, హుక్ తగిలిస్తుండగా షాక్‌కు గురై, మృతిచెందాడు. తీగల పైనే మృతదేహం వేలాడగా, కిందకు దించేందుకు గ్రామస్తులెవరూ సాహసించలేదు. చివరకు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించగా, సరఫరాను నిలిపి వేసిన అనంతరం మృతదేహాన్ని కిందకు దించారు. ఘటనపై రాయిఘర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**తెగిపడిన తీగలతో ఆందోళన..**

పర్లాకిమిడి: పట్టణంలోని ఒకటో నంబర్ వార్డు రాంనగర్‌లో 11కేవీ విద్యుత్ తీగలు తెగి ఇళ్లపై పడటంతో స్థానికులు భయపడి పరుగులు తీశారు. అయితే ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై టాటా విద్యుత్ సంస్థ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఓ బాలిక తెగి పడిన విద్యుత్ తీగలపై పడి తీవ్రంగా గాయపడిందని బీజేపీ యువమోర్చా నాయకులు కోట్ల యువరాజ్ గుర్తు చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా విద్యుత్‌శాఖ ఇంజినీర్లు స్పందించడం లేదని విమర్శించారు. వర్షాల సీజన్ కావడంతోపెను ప్రమాదం జరగక ముందే పరిష్కరించాలని కోరారు.

# నాగలి పట్టి.. నాట్లు వేసి



పొలంలో దమ్ము పడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రంధారీ



వరి నాట్లు వేస్తున్న కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్

కొరాపుట్: వారిద్దరూ స్వయానా అన్నాచెల్లెల్లు. పక్క పక్క నియోజకవర్గాల్లో బీజేడీ పార్టీ తరఫున ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధికార బాధ్యతల్లో నిత్యం క్షణం తీరిక లేని వారిద్దరూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పొలం పనుల్లో దిగారు. కూలీలతో సమానంగా పనులు చేస్తూ ఆదర్శంగా నిలిచారు. నవరంగ్‌పూర్ జిల్లా డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్ గిరిజన వ్యవసాయ కుటుంబాల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. ఎంత హోదాకు ఎదిగినా బాల్యం నుంచి అబ్బిన వ్యవసాయ పనులపై మమకారం తీరలేదు. ప్రస్తుత ఖరీఫ్ పనుల్లో ఎమ్మెల్యే మనోహర్ రంధారీ స్వయంగా నాగలి పట్టుకొని పొలంలో దుక్కి చేశారు. అలాగే ఎమ్మెల్యే పద్మినీ దియాన్ కూడా తన పొలంలో వరి నాట్లు వేశారు.

# విన్నపాలు.. విన్నారు



బరంపురం: గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖల ఉన్నతాధికారులు

- జిల్లాస్థాయి గ్రీవెన్స్‌కు అనూహ్య స్పందన
- పలువురు లబ్ధిదారులకు భూమి పట్టాలు పంపిణీ

పర్లాకిమిడి: జిల్లాలోని మోహానా నియోజకవర్గం మహేంద్రగడలో రాజీవ్‌గాంధీ సేవా కేంద్రంలో గ్రీవెన్సు సెల్ సోమవారం నిర్వహించారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, మోహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో, డిప్యూటీ కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్, బీడీఓ తదితరులు హాజరయ్యారు. మొత్త 135 వినతులు అందగా, వీటిలో 4 వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. అర్హులకు ఇళ్లు, భూ పట్టాలను(ఆర్ఓఆర్)ను అందజేశారు. పలువురు నిస్సహాయులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.10 వేల చొప్పున్న చెక్కులు పంపిణీ చేశారు. గ్రీవెన్స్‌కు ఛెలిగడ, మహేంద్రగడ, శియ్యాళిలోట్టి, చెల్లాగడ తదితర పంచాయతీలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.

**అటవీ హక్కులు పంపిణీ..**

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి కొదమా పంచాయతీలో 60మంది ఆదివాసీలకు అటవీ భూమి హక్కు పట్టాలను కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా భాగంగా ముగ్గురుకి రూ.10 వేల చొప్పున్న ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సాయం అందించగా, అదే సమితిలోని ఓ దివ్యాంగునికి ట్రై సైకిల్ అందించారు. అలాగే రెడ్‌క్రాస్ నిధుల నుంచి ఒకరికి రూ.7 వేల చొప్పున ఆర్థికసాయం పంపిణీ చేశారు. మొత్తం 64 వినతులు అందగా, ఇందులో 46 వ్యక్తిగతమైనవి, మరో 18గ్రామ సమస్యలుగా గుర్తించారు. వీటిని సకాలంలో పరిష్కారించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ధర్మానంద బెహరా, అదనపు ఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రొ, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

**అధికారుల దృష్టికి ప్రజా సమస్యలు..**

బరంపురం: జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా అధ్యక్షతన జరిగిన జరిగింది. ఇందులో వందలాది మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల ముందుంచారు. తమ ప్రాంతాల్లో తాగునీరు అందడం లేదని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, రోడ్డు సౌకర్యం, ఉపాధి కల్పించాలని తదితర విన్నవించారు. కార్యక్రమంలో బరంపురం సబ్ కలెక్టర్ ఆశిష్ కులకర్ణి, ఎస్పీ సరవణ్ వివేక్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మహేంద్రగడలో లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ



రాయగడ: అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్



నిస్సహాయులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో 8 మందికి అర్హత



బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారితో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

**విజయనగరం:** జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో 8 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. నగరంలో నిర్వహించిన టెస్ట్‌లో పి.పునీత్, వి.కుశాల్, కె.సాహిత్య, సంకీర్తన, ఎస్.సాత్విక్, ముఖేష్, రిషి, లిఖిత్ ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిలో ఉన్నారు.వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

### హిందీ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

**మెంటాడ:** మండలంలోని పెదమేడపల్లి ఆదర్శ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వి.రామానందసాగర్‌పై సస్పెన్షన్ విధిస్తూ డీఈఓ లింగేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు పంపారని వైస్ ప్రిన్సిపాల్ జి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతకాలంగా తమను పలురకాలుగా వేధిస్తున్నారని పాఠశాలలోని కొంతమంది విద్యార్థులు నేరుగా డీఈఓకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 1వ తేదీన డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు పాఠశాలకు విచారణ వచ్చి విద్యార్థులతో మాట్లాడి వారి వివరణ తీసుకున్నారన్నారు. వాస్తవాలను గ్రహించి సస్పెన్షన్ ఉత్తర్వులు పాఠశాలకు పంపించారని తెలిపారు.

**వార్డు శానిటరీ కార్యదర్శి..**

**పాలకొండ:** పట్టణంలోని బాసూరు వీధి సచివాలయం వార్డు శానిటరీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌పై కలెక్టర్ నిషాంత్ కుమార్ సస్పెన్షన్ విధించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హేమంత్ కుమార్‌ను బీఎల్‌వోగా స్థానిక బాసూరు వారి వీధి సచివాలయంలో నియమంచగా 10 రోజులుగా ఆయన ఆర్డర్ తీసుకోలేదు. దీనిపై తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ స్పందించలేదు. దీంతో కలెక్టర్‌కు తహసీల్దార్ ఫిర్యాదు చేయగా సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### కుంగిపోయిన కల్వర్టు



రైవాడ కాలువ కల్వర్టులో కూరుకుపోయిన లారీ

**వేపాడ:** మండలంలోని కృష్ణారాయుడుపేట వెళ్లే రహదారిలో రైవాడ కాలువ గట్టువద్ద కోటా బియ్యం తీసుకువెళ్తున్న లారీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస గొడౌన్ నుంచి కృష్ణారాయుడుపేట రేషన్ డిపోకు బియ్యాన్ని లారీతో తరలిస్తుండగా గ్రామం సమీపంలో రైవాడ కాలువ కల్వర్టు కుంగిపోయింది. దీంతో లారీ వెనుక టైర్లు కల్వర్టులో కూరుకుపోయియి. డ్రైవర్ చాకచక్యంతో లారీని నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

### అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల పునరుద్ధరణ

**పార్వతీపురంటౌన్:** పార్వతీపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి నడుస్తున్న బస్సు సర్వీసులను పునరుద్ధరించినట్లు డిపో మేనేజర్ కనకదుర్గ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి జేకేపూర్, నారాయణపట్టణం అంతర్‌రాష్ట్ర సర్వీసులు ఒడిశా రాష్ట్రంలోకి ప్రవేశించడానికి కావాల్సిన పర్మిట్ కాలపరిమితి జూలై 1తో ముగియడంతో ఈ రెండు సర్వీసులు నిలిపివేసినట్లు చెప్పారు. ఈనెల 22న పర్మిట్ రావడంతో ఈ రెండు సర్వీసులను పునరుద్ధరించామని తెలిపారు. జేకేపూర్ సర్వీసు పాత టైం ప్రకారం నడుస్తుందని, నారాయణపట్నం సర్వీసుకు అదనంగా ఒక ట్రిప్పు పెంచామని వివరించారు.

### మా డబ్బులు మాకు ఇప్పించండి



డిపాజిట్ చేసిన నగదును ఇప్పించాలని కోరుతున్న మహిళలు

**గుర్ల:** మోసపూరిత కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేసి మోసపోయామని తమ డబ్బులు తమకు ఇప్పించాలని మండలంలోని శేషపుపేట మహిళలు వేడుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 39 మంది మహిళలు డిపాజిట్లు చేసిన రశీదులతో సోమవారం గుర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేఎంజీ ల్యాండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, లోహిత్ భారత్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరు మీద పదేళ్ల కిందట మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన ఒక ఏజెంట్ డిపాజిట్లు సేకరించినట్లు వారు తెలిపారు. డిపాజిట్ల గడువు పూర్తయినందున నగదు చెల్లించాలని ఏజెంట్ వద్దకు వెళ్తే కంపెనీ మూసివేశారని చెబుతున్నాడని వాపోయారు.

# నేటి నుంచి రాష్ట్రపతి పర్యటన



రాష్ట్రపతి సందర్శన ప్రాంగణాల్లో ప్రత్యేక తనిఖీ కార్యకలాపాల్లో అనుబంధ శాఖల ఉన్నతాధికారులు

- భువనేశ్వర్‌లో కార్కేడ్ రిహార్సల్ నిర్వహించిన పోలీసులు
- భారీ భద్రతా చర్యలు చేపట్టిన యంత్రాంగం

**భువనేశ్వర్:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి మంగళవారం చేరుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమె వివిధ కార్యక్రమాలకు హాజరుకానున్నారు. గత ఏడాది జూలైలో భారత రాష్ట్రపతిగా అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత ముర్ము.. తన సొంత రాష్ట్రమైన ఒడిశాకు రావడం వరుసగా ఇది మూడోసారి. పర్యటన దృష్ట్యా కమిషనరేట్ పోలీసులు భువనేశ్వర్, కటక్ నగరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 55 ప్లటూన్ల పోలీసు బలగాలను మొహరిస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యల్లో భాగంగా సుమారు 300మంది అధికారులకు వేర్వేరు బాధ్యతలు కేటాయించారు. ఈ కార్యకలాపాల్లో 12మంది అదనపు డీసీపీ హోదా అధికారులు, 25మంది సహాయ పోలీసు కమిషనర్లు, 40మంది ఇన్‌స్పెక్టర్లు, 120మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. వీరితో 3యూనిట్ల క్విక్ రెస్పాన్స్ బృందాలు, 2యూనిట్ల స్పెషల్ టెక్నిక్ బృందాలు, 160మంది ట్రాఫిక్, 150మంది హోమ్ గార్డులను రంగంలోకి దింపుతున్నారు. పర్యటన పురస్కరించుకుని సోమవారం భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాజ్‌భవన్ వరకు ప్రయాణ మార్గంలో కార్కేడ్ తుది రిహార్సల్ సోమవారం నిర్వహించారు. ఆమె నగరానికి చేరిన తర్వాత రాత్రి రాజ్‌భవన్‌లో బస చేస్తారు. ఈనెల 26(బుధవారం) కటక్ నేషనల్ లా యూనివర్సిటీ ఒడిశా(ఎన్‌ఎల్‌యూఓ) 10వ స్నాతకోత్సవం, ఒడిశా హైకోర్టు 75వ వార్షికోత్సవ వేడుకల్లో ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరవుతారు. 27న(గురువారం) ప్రజాపిత బ్రహ్మకుమారి దివ్య లైట్‌హౌస్‌కు శంకుస్థాపన చేస్తారు. దీంతో పాటు బలియపాడులో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

# భారీ అలుగు స్వాధీనం



పట్టుబడిన నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

**కొరాపుట్:** అరుదైన వన్యప్రాణి అలుగును నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని రాయిఘర్ అటవీ సిబ్బందికి అలుగు అక్రమ రవాణాపై సోమవారం సమాచారం అందింది. ఈ మేరకు రాయిఘర్, కుందయి రేంజ్‌కు చెందిన సిబ్బంది హతబరండి వద్ద అనుమానస్పద స్థితిలో వెళ్తున్న బైక్‌ను అడ్డగించారు. సిబ్బందిని చూసి వెనుక వైపు కూర్చున్న వ్యక్తి పరారయ్యాడు. మరో వ్యక్తి వద్ద గోనే సంచిలో ఉన్న భారీ అలుగును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి దోమాగుడకు చెందిన సంజిత్ కుల్‌సిలాగా గుర్తించారు. ఈ జీవాన్ని రాయ్‌పూర్ తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. రాయిఘర్ అటవీ రేంజర్ తనూజా కార్తీక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### భార్యపై అనుమానంతో భర్త దాడి

**పార్వతీపురం:** అనుమానంతో భార్యపై ఓ భర్త వేడి నీరు పోసి దాడికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని పైడివీధికి చెందిన తాడంగి ప్రసాద్, దమయంతి దంపతులు టిఫిన్ షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. భార్యపై అనుమానంతో భర్త ప్రసాద్ చీటికీమాటికి ఆమెతో గొడవ పడుతూ ఉండేవాడు. సోమవారం టిఫిన్ కోసం వచ్చిన యువకుడికి ఆమె పార్సిల్ కడుతుండగా అనుమానంతో వేడినీరు ముఖంపై విసిరికొట్టాడు. దీంతో నుదురు, ముఖంపై గాయాలయ్యాయి.

అలాగే వారి కుమార్తె పవిత్రపై కూడా వేడినీరు పడడంతో పలు చోట్ల బొబ్బలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి పుట్టింటి వారు వచ్చి చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి ఆమెను తరలించారు.

# బ్యాంకు చోరీకి విఫల యత్నం

- గ్యాస్‌కట్టర్‌తో సెంట్రల్ బ్యాంక్ కిటికీ తొలగింపు
- లాకర్ తెరిచేందుకు విఫలయత్నం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



బ్యాంక్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ



చోరీకి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, కట్టర్

**పార్వతీపురంటౌన్:** పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల సెంట్రల్ బ్యాంకులో చోరీయత్నం కలకలం రేపింది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఉన్న బ్యాంకులో ఈ ఘటన జరగడం చర్చనీయాంశమైంది. సెంట్రల్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ సోమవారం ఉదయం 9.30 గంటలకు బ్యాంకుకు చేరుకుని షట్టర్ ఓపెన్ చేసి బ్యాంకు లోపలికి వెళ్లారు. బ్యాంకులో ఉన్న కిటికీ తెరిచి ఉండడంతో ఆయన హుటాహుటిన పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై దినకర్ వచ్చి ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు గ్యాస్ కట్టర్ల సహాయంతో బ్యాంకు కిటికీలను తొలగించి లోపలికి చొరబడ్డారు. గ్యాస్‌కట్టర్ల సహాయంతో బ్యాంక్ లాకర్‌ను పగలగొట్టడానికి ప్రయత్నించినప్పటికీ తెరుచుకోకపోవడంతో చేసేది లేక వెనుదిరిగారు. బ్యాంకులో వస్తువులు, నగదు అపహరణకు గురికాలేదని, ఎటువంటి చోరీ జరగలేదని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. చోరీకి యత్నించిన నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎటువంటి సొత్తు అపహరణకు గురికాలేదన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# 28నుంచి మావోయిస్టు వారోత్సవాలు



మావోయిస్టులు విడుదల చేసిన వారోత్సవాల పోస్టర్

**మల్కన్‌గిరి:** జిల్లాలో జూలై 28నుంచి ఆగస్టు 3వరకు మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆంధ్రా-ఒడిశా స్పెషల్ జోనల్ కామిటీ కార్యదర్శి గణేష్ పేరుపై సోమవారం లేఖను విడుదల చేశారు. ఇందులో ఏటా తరహాలోనే ఈ దఫా కూడా వారోత్సవాలు జరుపుదామని, ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి అమరులకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. అగ్ర నాయకులు కామ్రేడ్ చారుముజుందార్, కామ్రేడ్ కన్నయ ఛటర్జీలు పార్టీని ప్రారంభించి 50ఏళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో విప్లవ గీతాలాతో వారిని స్మరించుకోవాలని కోరారు. మరోవైపు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జవాన్లు కూబింగ్ ముమ్మరం చేశారు. జిల్లా పోలీసులతో పాటు బీఎస్ఎఫ్, డీఆర్‌జీ జవాన్ల్ సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నారు.

### ఒకేచోట తల్లీకొడుకుల అంత్యక్రియలు



తల్లీకుమారుల మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకువెళ్తున్న స్థానికులు

**రాజాం సిటీ:** స్థానిక మెంటిపేట ఎస్సీకాలనీకి చెందిన తల్లీ కొడుకులు కురమమ్మ, అమర్‌ల మృతదేహాలకు కుటుంబీకులు, స్థానికులు ఒకే చోట సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.ప ఈ నెల 23న పలాస ఆర్టీసీ డిపో వద్ద గుండెపోటుకు గురైన కండక్టర్ కురమమ్మ మృతిచెందగా సాయంత్రానికి ఆమె మృతదేహం రాజాం తీసుకువచ్చారు. ఏలూరులో ఫాదర్ శిక్షణ పొందుతున్న ఆమె కుమారుడు అమర్ తల్లి మృతిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు అక్కడికి వెళ్లి సోమవారం సాయంత్రానికి రాజాం తీసుకువచ్చారు. దీంతో ఇద్దరి మృతదేహాలను చూసిన కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆర్‌సీఎం చర్చి వద్ద ప్రార్థనల అనంతరం మృతదేహాలను ఖననం చేశారు.

### డ్రైవర్ హత్య కేసులో రెండో ప్రధాన నిందితుడి అరెస్టు

**బొండపల్లి:** ఈనెల 13 వతేదీన గొట్లాం వద్ద లారీ డ్రైవర్‌ను హత్య చేసి రైలు పట్టాలపై పడవేసిన కేసులో రెండో ప్రధాన నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లెంక అప్పలనాయుడు తెలిపారు. సాలూరు పట్టణానికి చెందిన అర్నిపల్లి ధనుంజయ నాయుడుతో పాటు మరి కొంతమంది లారీతో వస్తున్న డ్రైవర్ జగదీష్ యాదవ్‌ను ఆపి ప్రయాణికుల ముసుగులో ఎక్కి హత్య చేసి రైలు పట్టాలపై శవాన్ని పడవేసినట్లు తెలిపారు. ఈ హత్య కేసులో రెండో ప్రధాన సూత్రధారిగా ధనుంజయ్ నాయుడు ఉన్నాడని చెప్పారు.

### కారు ఢీకొని వ్యక్తి మృతి

**విజయనగరం క్రైమ్:** మండల పరిధిలోని గుంకలాం గ్రామానికి చెందిన లెంక గోవిందరావు (45) టీవీ ఎస్ బైక్‌తో ఇంటి నుంచి పొలంలోకి వెళ్తూ గ్రామ పరిధిలో జాతీయ రహదారిని దాటుతుండగా గొట్లాం రోడ్డు నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో గోవిందరావు తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు, కుటుంబసభ్యుల సహాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే గోవిందరావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య కుమారి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

# లీకులపై కలకలం

- ఓఎస్ఎస్‌సీ కార్యాలయం ఆవరణలో అభ్యర్థుల నిరసన
- నిష్పక్షపాత విచారణకు డిమాండ్



ఓఎస్ఎస్‌సీ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

**భువనేశ్వర్:** జూనియర్ ఇంజినీర్(సివిల్) పోస్టుల ప్రధాన రాతపరీక్షకు హాజరైన అభ్యర్థులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ విచారకర ఘటన పట్ల నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా ఒడిశా స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఓఎస్ఎస్‌సీ) కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శనకు దిగారు. జూనియర్ ఇంజినీర్(సివిల్) పోస్టుల ప్రధాన రాతపరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తేలడంతో రద్దు చేసినట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఘటన కారణంగా ప్రధాన రాత పరీక్షను రద్దు చేయడం కెరీర్‌ను ప్రమాదంలోకి నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓఎస్ఎస్‌సీ చైర్మన్ తదుపరి పరీక్ష తేదీని ప్రకటించినప్పటికీ తాము వేధింపులకు గురవుతున్నట్లు తెలిపారు. మళ్లీ ప్రశ్నపత్రం లీకేజీ పునరావృతం కాదని ఎవరు హామీ ఇస్తారని నిలదీశారు. అనంతరం ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లి సమస్యను వివరించారు. లీకేజీ వ్యవహారంలో బాధ్యుల వివరాలను బహిర్గతం చేయాల్సిందేనని పట్టుబట్టారు. ఈ ముఠాలో ఓఎస్ఎస్‌సీకి చెందిన కొందరు అధికారులు, రాష్ట్రప్రభుత్వం ప్రమేయం ఉందని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కోరారు. నకిలీ జాబ్ రాకెట్‌పై విచారణ అనంతరం బాలాసోర్ ఎస్పీ సాగరిక నాథ్ సిఫార్సు మేరకు ఓఎస్ఎస్‌సీ చైర్మన్ అభయ్ జేఈ(సివిల్) ప్రధాన పరీక్షను రద్దు చేసినట్లు ఆదివారం ప్రకటించారు.

# 260 లీటర్ల సారా స్వాధీనం



పాలకొండ రూరల్: ఘటనా స్థలంలో నిందితులు వదిలి వెళ్లిన ద్విచక్రవాహనం, సారా



జియ్యమ్మవలస: సారా ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

**పాలకొండ రూరల్:** మండలంలోని లుంబూరు -ఓని గ్రామాల మీదుగా ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న 260 లీటర్ల సారాను పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్‌తో కూడిన ప్రత్యేక పోలీసు బృందం స్వాధీనం చేసుకుంది. సోమవారం వేకువజామున ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి పోలీసుల కదలికలను పరిశీలిస్తూ రావడం, ఆ వ్యక్తి సూచనలతో మరో ముగ్గురు మూడు ద్విచక్రవాహనాలపై నల్లని మూటల్లో ప్రత్యేక క్యాన్లలో సారాను తీసుకురావడంపై అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోవడంతో సారా నిల్వలు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదుచేశారు. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

**సారా ధ్వంసం**

**జియ్యమ్మవలస:** జియ్యమ్మవలస, చినమేరంగి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇటీవల పట్టుబడిన సారాను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 200 లీటర్ల సారా, 26 లీటర్ల మద్యం, చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 1956 లీటర్ల సారా, 25 లీటర్ల మద్యం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో చినమేరంగి ఎస్సై కళాధర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**సారా కేన్లతో వ్యక్తి అరెస్ట్**

జియ్యమ్మవలస మండలంలోని రావాడ పరిసర ప్రాంతాలలో 8 కేన్లతో సారా తరలిస్తుండగా నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఓ నిందితుడు దొంగచాటుగా సారా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

**సీతంపేటలో 173 లీటర్ల సారా..**

**సీతంపేట:** కొద్ది రోజుల కిందట దాడుల్లో పట్టుబడిన 173.5 లీటర్ల సారాను పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సమక్షంలో సోమవారం ధ్వంసం చేశారు. 13 కేసులలో ఈ సారాను పట్టుకున్నట్లు సీతంపేట ఎస్సై నీలకంఠరావు తెలిపారు.

**1500 సారా ప్యాకెట్ల స్వాధీనం**

**పాచిపెంట:** అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తి నుంచి 1500 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫకృద్దీన్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఎడ్ల సన్యాసి సోమవారం తన ద్విచక్ర వాహనంతో ఒడిశా నుంచి పాచిపెంట వైపు 1500 సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామని, నిందితుడి నుంచి సారా ప్యాకెట్లతో సహా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# బుసకొడుతున్నాయి.. జాగ్రత్త..!

'గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన కమటాన చిరంజీవి గత ఏడాది సెప్టెంబర్ 8న పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా పాము కాటువేసింది. కాలికి ఏదో విషపురుగు కరిచినట్టు గుర్తించి నడుచుకుంటూ గ్రామానికి వెళ్లాడు. గ్రామానికి వెళ్లిన ఐదు నిముషాల్లో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. ఆయనకు కరిచింది చంద్రపొడి (రెసెల్స్‌వైపర్) జాతికి చెందిన విష సర్పమని, సకాలంలో ఆస్పత్రికి తీసుకొస్తే ప్రాణాలు నిలిచేవని వైద్యులు తెలిపారు. నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం గాలిలో కలిసిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.'

కురుపాం మండలం దండుసూర గ్రామానికి చెందిన కొండగొర్రి రామకృష్ణ గత ఏడాది సెప్టెంబర్ 7న పత్తి పంటను చూసేందుకు వెళ్లగా ఉల్లిపాము కరిచింది. ఆయన ఎటువంటి భయానికి గురికాకుండా దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి వైద్యులు స్నేక్‌యాంటీ వీనం వ్యాక్సిన్ వే శారు. మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్‌చేశారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది.

- వర్షాకాలంలో పాముల సంచారం అధికం
- రైతులు జాగ్రత్తలు పాటించాలి
- రెండేళ్లలో జిల్లాలో 498 మందికి పాముకాటు
- ముగ్గురు మృతి
- సకాలంలో ఆస్పత్రికి చేర్చితే ప్రాణభయం ఉండదంటున్న వైద్యులు



పాముకాటుతో మృతిచెందిన చిరంజీవి (ఫైల్)

**పార్వతీపురం టౌన్:**

వర్షాకాలం వచ్చిందంటే సాధారణంగా పాముల సంచారం అధికంగా ఉంటుంది. పొలం పనిలో నిమగ్నమైన సమయంలో, గట్లపై వెళ్తున్న సమయంలో రైతులు పాముకాటు బారిన పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు సంవత్సరంలో 498 మంది పాముకాటుకు గురయ్యారు. వీరిలో ముగ్గురు మృతిచెందారు. సరైన అవగాహనలేకపోవడం, సకాలంలో చికిత్స అందకపోవడమే కారణమని వైద్యులు తేల్చారు. అవగాహన ఉంటే ప్రాణాపాయ స్థితినుంచి బయట పడవచ్చని చెబుతున్నారు. వర్షాకాలంలో ఎక్కువగా పాములు సంచరించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, పొలాలకు వెళ్లే రైతులు తప్పనిసరిగా చూసుకొని వెళ్లాలని సూచిస్తున్నారు.

**ఏమరపాటు తగదు...**

ప్రస్తుత వర్షాకాలంలో పాములు తల దాచుకోవడానికి అనేక ప్రాంతాలను ఎంపిక చేసుకుంటాయి. పొలం గట్ల మీద, చెట్లు ఉన్న ప్రాంతాల కింద నక్కి ఉంటాయి. దీనికి తోడు అవి జనావాసాల్లోకి కూడా వస్తుంటాయి. పొలాల పక్కనే ఉన్న ఇళ్లతో పాటు ఇళ్లలో చిందరవందరగా సామాన్లు పడేసిన గదుల్లో తలదాచుకొంటాయి.అప్రమత్తంగా ఉండి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవడంతోపాటు మురుగు లేకుండా చూసుకోవటం, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు కర్ర చేతిలో ఉంచు కోవడం, వినికిడి శబ్దాలు చేసే పరికరాలు దగ్గర ఉంచుకోవడం మంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని గుట్టలు, పుట్టలు దగ్గర ఆటలాడనివ్వకుండా జాగ్రత్త వహించాలి. రైతులు పశువులను పాకల్లో కట్టేసి ఉంచినప్పుడు అక్కడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాముల్లో అన్నీ ప్రమాదకరమైనవి కావు విషపూరితమైన నాగుపాము, కట్లపాడు, రక్తపింజరి, చంద్రపొడి వంటి పాములతో జాగ్రత్తగా ఉండాలి. పాము కరిచిన వెంటనే స్నేక్ యాంటీ వీనమ్ తీసుకోవాలని చెబుతున్నారు.

**పాము కాటు లక్షణాలు**

పాము కాటుకు గురైన వెంటనే మనిషి శరీరం చల్లగా మారిపోతుంది. ఛాతిలో విపరీతమైన నొప్పి రావ డంతోపాటు ఆయాసం వస్తుంది. నోటి నుంచి నురగలు వస్తాయి.

**ప్రథమ చికిత్స ఇలా..**



- పాము కాటుకు గురైన వ్యక్తిని నిదానపరచాలి. కంగారు పడకుండా చూడాలి. ఆందోళనకు గురైతే విషం వేగంగా శరీరం అంతా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.
- పొడిగా, వదులుగా ఉన్న పట్టీతో లేదా వస్త్రంతో కాటును కప్పాలి.
- వేగంగా యాంటీ-వీనమ్‌ను అందించగల ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలి.
- గాయం కడగకూడదు. గాయం మీద ఐస్‌ను పెట్టకూడదు.
- గాయం నుంచి విషాన్ని పీల్చేందుకు ప్రత్నించరాదు.



జిల్లాలో రెండేళ్లలో పాముకాటు కేసులు ఇలా..

| సంవత్సరం | అస్వస్థత | మృతులు |
|---|---|---|
| 2021-22 | 307 | 02 |
| 2022-23 | 191 | 01 |

### పాము కాటుకు అందుబాటులో చికిత్స



పాముకాటు బారిన పడిన వ్యక్తికి పీహెచ్‌సీలలో చికిత్స అందుబాటులో ఉంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్‌వీనం వ్యాక్సిన్లు లభ్యమవుతున్నాయి. పాము కాటుకు గురైన వ్యక్తి భయపడకుండా కరిచిన వెంటనే ముందుగా గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తీసుకోవాలి. గాయాన్నిబట్టి రెండుసార్లు స్నేక్‌వీనం డోస్ తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. భయపడకుండా నిర్భయంగా ఉండాలి.

– డాక్టర్ బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం మన్యం

## క్లుప్తంగా

### ఎస్పీని కలిసిన డీసీఆర్‌బీ సీఐ


ఎస్పీ జి.ఆర్.రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నవీన్‌కుమార్

**శ్రీకాకుళం క్రైమ్:** సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం డీసీఆర్‌బీ సీఐగా విధుల్లో చేరిన దేవరపల్లి నవీన్‌కుమార్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. విధివిధానాలపై పలు సూచనలు, సలహాలను ఎస్పీ ఆయనకు చేశారు ఈయన 2004 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన వారు. ట్రైనింగ్ ఎస్‌ఐగా మందసలో తొలిసారి విధుల్లో చేరి 2006లో సంతబొమ్మాళి ఎస్‌ఐగా చేశారు. 2007లో వజ్రపుకొత్తూరు.. ఆతర్వాత ఇచ్ఛాపురం, శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. 2013లో ప్రమోషన్‌పై రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఆమదాలవలస, విశాఖపట్నం పశ్చిమ క్రైమ్, శ్రీకాకుళం స్పెషల్‌బ్రాంచి, రాజాం రూరల్‌లో సీఐగా చేశారు. అడిషనల్ ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలను కూడా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

### విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి

- బీఆర్‌ఏయూ వీసీ


మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

**ఎచ్చెర్ల క్యాంపస్:** జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని.. అందుకు పరిశ్రమించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వర్సిటీకి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకోవాలన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ డీజీఎం డాక్టర్ అద్దంకి మురళీమోహన్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకమని చెప్పారు. అధునాతన సాంకేతిక ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, చింతాడ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

### జాషువ విగ్రహావిష్కరణ


జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** సామాజిక స్పృహ కలిగించే కవితలు రాసి కవిసార్వభౌమునిగా చరిత్రలో నిలవడమే కాకుండా బడుగు బలహీనవర్గాలకు మార్గదర్శిగా గుర్రం జాషువా నిలిచిపోయారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు అన్నారు. నగరంలోని జ్యోతిరావుపూలే పార్కులో ఏర్పాటు చేసిన జాషువా విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ కులంలో జన్మించి అనేక అవమానాలు ఎదుర్కొన్న జాషువా కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారని, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విగ్రహ బహూకరణ కర్త కంతం వేణు, బహుజన నాయకులు కల్లేపల్లి రామగోపాలం, గుత్తు చిన్నారావు, కర్రి రంగాజీదేవ్, బీసీ సంఘ పట్టణ కార్యదర్శి రావుపల్లి సురేంద్ర, సంవలాపురం కిశోర్ పాల్గొన్నారు.

### చేనేతను పరిశీలించిన నిఫ్ట్ విద్యార్థినులు

**పొందూరు:** పొందూరు సన్నఖాదీ వస్త్రాల నేత, వడుకు ప్రక్రియలను హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)కి చెందిన విద్యార్థినులు పరిశీలించారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఖాదీ కార్మికుల గృహాలను సందర్శించి నేత, వడుకు ప్రక్రియలను పరిశీలించారు. వస్త్రం తయారీలో కార్మికుల నైపుణ్యానికి విద్యార్థినులు అబ్బురపడ్డారు. జాతీయ అవార్డును సాధించిన కార్మికులతో ముచ్చటించారు.

### యువకుడి అదృశ్యం

**రణస్థలం:** జె.ఆర్.పురం పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన యువకుడు చింతనిప్పుల రవికుమార్ (38) కనిపించడం లేదని అతని భార్య అనూష ఫిర్యాదు చేసినట్టు స్థానిక ఎస్సై జి.రాజేష్ సోమవారం తెలిపారు. జె.ఆర్.పురంలోని బజాజ్ షోరూం పక్కన టిఫిన్ దుకాణం నిర్వహించే రవికుమార్ ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు 81064 31509, 99630 64372, 85001 03966 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

# ఆహారం తయార్..!

- ఆహా క్యాంటీన్ల ఏర్పాటుకు సర్కారు కసరత్తు
- జన సంచారం గల ప్రాంతాల్లో ఏర్పాటు
- ప్రభుత్వ ఆస్పత్రులు, బస్టాండ్‌లే తొలి ప్రాధాన్యం
- మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి


రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన టెంట్‌లు ఇవే

**కాశీబుగ్గ:** జన సంచారం గల ప్రాంతాల్లో తక్కువ రేటుకు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో పట్టణపేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో టీఎల్‌ఎఫ్‌లో ఉన్న స్వయం శక్తి సంఘాలకు బాధ్యతలు అప్పగించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహా క్యాంటీన్ల పేరుతో మార్కెట్ రేటులో సగభై శాతానికి మాత్రమే భోజనం అందించేలా కార్యాచరణ చేశారు.

**ఏమిటీ ఆహా.. క్యాంటీన్లు?**

మున్సిపాలిటీల్లోని స్వయం శక్తి సంఘాల మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డ్వాక్రా బజార్లు, కుట్టు మిషన్ల శిక్షణ, కంప్యూటర్ శిక్షణ, సుద్దముక్కల తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి ఉపాధి చూపిస్తున్నారు. ఇందులో భాగంగా ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేసి అటు మహిళలకు ఉపాధి, ఇటు పట్టణ పేదలకు తక్కువ ధరకు రుచికరమైన భోజనాలను అందించనున్నారు. ఇందుకు మెప్మా వారు ప్రథమ దశలో రూ.13 వేలను అందించి ప్రోత్సహిస్తారు. అంతేకాకుండా టీఎల్‌ఎఫ్‌లతో రుణాలను అందిస్తారు.

**తక్కువ ధరకే..**

మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల్లో జన సంచారం అధికంగా ఉండే కూడళ్లను ముందు ఎంపిక చేస్తారు. ప్రభుత్వ ఆస్పత్రులు, బస్టాండ్‌లు, ఇతర పేదలు ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. మెప్మా వారి పూర్తి బాధ్యతలతో తిరిగి చెల్లించే విధంగా టెంట్‌లు, స్థలం, ఇతర అనుమతులు సౌకర్యాలు కల్పిస్తారు. ఇవన్నీ కల్పించిన అనంతరం టీఎల్‌ఎఫ్‌లో ఉన్న మహిళా సంఘాలు వీటి బాధ్యత తీసుకుని అటు ఉపాధితో పాటు పేదప్రజలకు భోజనాలను అందిస్తాయి.

**జిల్లాలో ఐదు క్యాంటీన్లు**

రాష్ట్ర మెప్మా ఎండీ ఆదేశానుసారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో మాత్రమే ఇప్పుడు క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మన జిల్లాలో ఐదు ఆహా క్యాంటీన్ల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. శ్రీకాకుళం నగర పాలక సంస్థలో 2, ఆమదాలవలస మున్సిపాలిటీలో 1, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 1, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఒకటి ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.


ఇతర జిల్లాలలో నడుస్తున్న ఆహా క్యాంటీన్

**స్థలం చూపించి టెంట్ ఇస్తాం**



ఆహా క్యాంటీన్లను స్వయం శక్తి సంఘాలకు చెందిన మహిళలే ముందుకు వచ్చి నిర్వహణ బాధ్యతలు చేపట్టవచ్చు. వాటితో వారు ఉపాధి పొందవచ్చు. మెప్మా.. ఆహా క్యాంటీన్‌కు సంబంధించిన అనుమతులు, స్థలం చూపించడం, టెంట్‌లు వంటివి సమకూర్చడం చేస్తుంది. అందుకు తగిన రుసుము వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించుకోవాలి. మొదటగా రూ.13 వేలు ప్రోత్సాహకంగా అందిస్తారు. అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తాం.
– పిన్నింటి మోహనరావు, సిటీ మిషన్ మేనేజర్

**ఔత్సాహికులకు ఆహ్వానం**



మున్సిపాలిటీలో ఉన్న ఆసక్తి గల టీఎల్‌ఎఫ్‌లకు ఈ అవకాశం కల్పిస్తాం. స్వయంశక్తి సంఘాల్లో రుణాలను పొందుతున్న వారు అయితే ఎంతో మేలు. దీంతో మహిళలు ఉపాధి పొందడంతో పాటు నిరుపేదలకు రుచికరమైన భోజనాలు అందుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వారిని పరామర్శించడానికి వచ్చిన వారికి ఇవి ఉపయోగపడతాయి. బస్టాండ్‌ల వద్ద ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.
– టి. నాగేంద్రకుమార్, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

## పాలనా వ్యవహారాలు కీలకం

- రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ కేసీ రెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చాన్సలర్ కేసీ రెడ్డి

**ఎచ్చెర్ల క్యాంపస్:** పరిపాలన వ్యవహార బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారు స్థానికంగా నివాసం ఉంటే అత్యవసర సమయాల్లో ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రూ. 5.20 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న వసతి నివాస సముదాయ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు వేల మంది విద్యార్థులతో కూడిన విద్యా సంస్థ సజావుగా ముందుకు సాగాలంటే పాలనా వ్యవహారాలు కీలకంగా చెప్పారు. అత్యవస సమయాల్లో అధికారులు స్థానికంగా ఉంటేనే స్పందించ గలరని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో సిబ్బంది నివాస గృహాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఏవో ముని రామకృష్ణ, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, అడ్మిషన్ల ఇన్‌చార్జి గోపాలరాజు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బొల్ల రామకృష్ణ

**కోటబొమ్మాళి:** మండలం హరిశ్చంద్రపురం ఎర్రచెరువు గట్టుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం, వనవిష్ణుపురానికి చెందిన బొల్ల రామకృష్ణ(42) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొల్ల రామకృష్ణ తన భార్య లక్ష్మితో కలిసి జలుమూరు మండలం చల్లవానిపేటలో ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా హరిశ్చంద్రపురం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మహేంద్రా లగేజీ వాహనాన్ని వీరి బండి ఢీకొట్టింది. ప్రమాదంలో రామకృష్ణ తలకు తీవ్రగాయమై సంఘటన స్థలంలోనే చనిపోయారు. భార్యకు చిన్నపాటి గాయాలయ్యాయి. మృతునికి కుమారులు తిరుపతిరావు, శేఖర్ ఉన్నారు. మృతునికి కోటబొమ్మాళి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## పాముకాటుకు గురైన మహిళ మృతి

**జి.సిగడాం:** పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. సేతుభీమవరం పంచాయతీ గంగన్నదొరపాలెం గ్రామానికి చెందిన కొరగింజి లక్ష్మి (65) ఈ నెల 22వ తేదీన ఇంట్లో సామాన్లను తీస్తుండగా.. పాటు కాటు వేసింది. దీంతో ఆమెను కుటుంబీకులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. లక్ష్మి మృతికి స్థానిక సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు కుదిరెల్ల సూజాత సంతాపం తెలియజేశారు.

## అక్రమ క్వారీలపై 'విజిలెన్స్' దాడులు

- 11 వాహనాల సీజ్


పట్టుబడిన వాహనాలు

**పొందూరు:** మండలంలోని రాపాక పరిధి ఇల్లయ్యగారిపేట సమీపంలో క్వారీలపై విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు సోమవారం దాడులు చేశారు. విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాల మేరకు డీఎస్పీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. ఎటువంటి అనుమతులు, లీజులు లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేపట్టామని అధికారులు పేర్కొన్నారు. ఇల్లయ్యగారిపేట సమీపంలో సర్వే నంబర్ 332, 98 పరిధిలోని కొండప్రాంతంలో పదుల సంఖ్యలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీల్లో పోలీసుల సహకారంతో దాడులు చేపట్టారు.

ఈ సందర్భంగా 11 వాహనాలను సీజ్‌చేసి పొందూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన వాటిలో ఏడు ట్రాక్టర్లు, రెండు లారీలు, రెండు కంప్రెషర్లు ఉన్నాయి. అనుమతులు, లీజులు లేకుండా నడుపుతున్న క్వారీలపై, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని విజిలెన్సు డీఎస్పీ కిరణ్‌కుమార్ తెలిపారు.

## జాతీయ స్విమ్మింగ్ పోటీలకు దరహాస్ ఎంపిక


దరహాస్‌కు పతకాన్ని అందించి పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న అతిథులు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన వేమకోటి ధనుష్య దరహాస్ సత్తా చాటాడు. విశాఖపట్నంలోని సంస్కృతి గ్లోబ్ స్కూల్ వేదికగా ఈ నెల 23వ తేదీన అండర్ వాటర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన వీడీ దరహాస్ రెండు బంగారు పతకాలు సాధించాడు. 50 మీటర్లు, 100 మీటర్ల బైఫిన్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. దీంతో ఈ యువ స్విమ్మర్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. దరహాస్ రాణింపుపై జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికాప్రసాద్, కోచ్‌లు కాంతారావు, మురళి, శ్రీచైతన్య కళాశాలల డీఎస్ కె.మురళీధర్, ఏజీఎం పి.నర్సునాయుడు, తల్లిదండ్రులు అభినందించారు.

### జూనియర్ లైన్‌మెన్‌కు గాయాలు

**లావేరు:** లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 గా పనిచేస్తున్న రాంబాబు తీవ్రంగా సోమవారం గాయపడ్డారు. విద్యుత్‌శాఖ మండల ఏఈ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామంలో మరమ్మతులు చేపట్టే ప్రక్రియలో భాగంగా రాంబాబు విద్యుత్ స్తంభం పైకెక్కి పనులు చేస్తున్నారు. ఇంతలో విద్యుత్ ఇండక్షన్ రావడంతో షాక్‌కు గురై పైనుంచి కిందకు పడిపోవడంతో గాయపడ్డాడు. వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు.

### జిల్లాలోని డీఎస్పీలకు స్థానచలనం

**శ్రీకాకుళం క్రైమ్ :** రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఉత్తర్వుల మేరకు జిల్లాలోని ముగ్గురు డీఎస్పీలకు బదిలీ చేస్తూ పోస్టింగులు ఇచ్చినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన సోమవారం విడుదలైంది. వీరు మారుతున్న స్థానాలతో పాటు ఖాళీగా ఉండిపోతున్న ప్రస్తుత పోస్టింగ్‌లో కూడా తదుపరి ఉత్తర్వులు వచ్చినంతవరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఉన్న సీహెచ్‌జీవీ ప్రసాదరావు విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం ఎస్సీ ఎస్టీ సెల్-1 డీఎస్పీగా ఉన్న బి.విజయ్‌కుమార్ శ్రీకాకుళం డిఫెన్సు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (డీపీటీసీ) డీఎస్పీగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా ఉన్న కె.బాలరాజును సివిల్ డీఎస్పీగా తాత్కాలిక బదిలీ చేస్తూ.. ఇదే స్పెషల్ బ్రాంచి డీఎస్పీగాను కొనసాగుతారని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఆస్పత్రిలో కేంద్ర బృందం పరిశీలన

**నరసన్నపేట:** ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు, పిల్లలకు అందుతున్న సేవలను కేంద్ర ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీ(నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్) బృందం సభ్యులు మీర్జా ఫైజల్ రెహమాన్, ఆశా భక్షిలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్‌సీ(చిన్నపిల్లల) యూనిట్‌లో సిబ్బంది, వైద్యుల పనితీరును పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రాష్ట్రంలో వైద్యం కోసం ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, ఆస్పత్రుల పరిస్థితి, అవసరమైన వైద్యుల నియామకాలు బాగున్నాయని తెలిపారు. ఎస్ఎన్‌సీ యూనిట్‌లో వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీరి వెంట జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త భాస్కరరావు, స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ , మహిళా వైద్యులు ఉన్నారు.

### 'నిర్ణీత సమయంలో పరిష్కరించాలి'

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** నిర్ణీత సమయంలో స్పందన అర్జీలు పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీ లు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలపై దృష్టి సారించి నాణ్యమైన సమాచారంతో తిరిగి అర్జీదారులకు సమాధానం పంపాలన్నారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామం వద్ద సుడా ఏర్పాటు చేసిన స్మార్ట్ టౌన్ షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం

### రూ.44.9 లక్షలు


నగదును లెక్కిస్తున్న దృశ్యం

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీల కానుకల లెక్కింపులో మొత్తం రూ. 44,90,993 ఆదాయం లభించింది. సోమవారం స్థానిక ఆలయ అనివెట్టి మండపంలో ప్రశాంతంగా లెక్కింపు జరిగింది. ఇందులో అధికంగా నగదు రూపంలో రూ.43,11,976, చిల్లర రూపంలో రూ.1,79,017 మేర ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. అలాగే వీటితో పాటు 36 గ్రాముల బంగారం, 2 కిలోల 140 గ్రాముల వెండి వస్తువులు మొక్కులుగా లభించినట్లుగా తెలిపారు. వీటితో పాటు విదేశీమారకద్రవ్యం రూపంలో కూడా మొక్కులను విదేశీ భక్తులు చెల్లించుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బీవీవీఆర్ ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షించారు. గత నెల 9 వ తేదీ నుంచి ఈ నెల 24 వరకు మొత్తం 46 రోజులకు గాను హుండీ కానుకల ద్వారా ఇంత ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

# పూజారికి వరం

- ఆలయ ఉద్యోగులకు విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- ఓపిక ఉన్నంతవరకు అర్చకత్వం చేసుకునేలా చరిత్రాత్మక నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్చకులు, ఉద్యోగులు





**అరసవల్లి:** ఆలయాల్లోని అర్చకులపై వైఎస్ జగన్ సర్కారు వరాల జల్లు కురిపించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచినట్లుగానే దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా గరిష్ట వయస్సు 62కి పెంచుతూ నిర్ణయాన్ని ఆమోదించింది. అలాగే దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంత వరకు భగవంతుడి సేవలో కొనసాగేలా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు నిర్ణయాలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారు. ఈ మేరకు జిల్లాలో ఎండోమెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్, అరసవల్లి ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌లు అర్చుల జాబితాను ఉన్నతాధికారులకు పంపేలా చర్యలు చేపడుతున్నారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇదిలావుంటే ఇప్పటికే అర్చకుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం..అనువంశిక హక్కులను కొనసాగించేలా కూడా ఇటీవల నిర్ణయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా అర్చక విధుల్లో కూడా వయో అడ్డంకిని తొలగించి గ్రీన్‌కార్పెట్ వేయడంపై అర్చక సమాఖ్య హర్షం ప్రకటించింది.

**800 మంది అర్చకులకు లబ్ధి**

జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో మొత్తం 799 ఆలయాలుంటే ఇందులో 115 ఆలయాలకు ఇటీవలే వంశపారంపర్య అర్చక హక్కులను కల్పిస్తూ.. అర్చకుల వారసులకు కూడా హక్కులను కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న సుమారు 800 మంది అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్టసవరణ చేసేలా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో వీరికి ఓపిక, శక్తి ఉన్నంతవరకు అర్చకత్వం చేసుకునే అవకాశం దక్కనుంది. ఇక ఆలయాల్లో ప్రస్తుతానికి పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య బాగా తక్కువే. దీంతో సుమారు 20 నుంచి 30 మంది వరకు మాత్రమే అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, రావివలస, కొత్తమ్మతల్లి, తదితర ఆలయాల్లో పని చేస్తున్నారు. వీరిలో అధికశాతం మంది కొద్ది నెలల్లోనే రిటైర్ కానున్నారు. ఇలాంటి వారికి తాజా ప్రభుత్వ నిర్ణయం ఊపిరినిచ్చింది. అర్చకులకు సంబంధించి నిర్ణయాలపై త్వరలో మార్గదర్శకాలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం విడుదల చేయనుంది.

**చరిత్రాత్మక నిర్ణయం**



ఆలయాల్లో అనువంశిక హక్కులు కొనసాగేలా నిర్ణయించడంతో పాటు ఓపిక, శక్తి ఉన్నంతవరకు ఆలయాల్లో పని చేసేలా అర్చకులకు రిటైర్‌మెంట్ లేకుండా చట్టసవరణ చేసేలా నిర్ణయించడం నిజంగా చరిత్రాత్మకమే. దీంతో ఆలయాల్లో దేవుళ్లకు ఆగమ శాస్త్రాల ప్రకారం నిత్యపూజలు, అర్చనలను చేసే సంప్రదాయం కొనసాగనుంది. ఏది ఏమైనా ఇచ్చిన మాట ప్రకారం నిర్ణయాన్ని అమలు చేయడం గొప్ప విషయం. ఆయనకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి.
– ఇప్పిలి శంకర శర్మ, అరసవల్లి ఆలయ ప్రధానార్చకులు

**ఇన్నాళ్లకు గుర్తించారు**



మరికొద్ది నెలల్లో రిటైర్ కానున్న నాకు ప్రభుత్వ తాజా నిర్ణయంతో రెండేళ్లు అదనంగా సర్వీసు పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆలయాల ఉద్యోగులకు కూడా అవకాశం ఇచ్చి 60 నుంచి 62 ఏళ్లకు పదవీ విరమణ వయస్సును పెంచారు. ఇది ఎంతో హర్షణీయం. నాలాంటి ఎంతో మందికి మేలు కలిగే నిర్ణయమిది.
– శిమ్మ మల్లేశ్వరరావు, అరసవల్లి ఆలయ ఉద్యోగి

## 'ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి'


స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న బెంతు ఒరియా కులస్తులు

**ఆమదాలవలస:** శ్రీకాకుళం జిల్లాలో నివాసం ఉంటున్న బెంతు ఒరియా కులస్తులను ఎస్టీలుగా గుర్తించాలని, ఎస్టీ సర్టిఫికెట్ల జారీని పునరుద్ధరించాలని ఆ కుల ప్రతినిధులు స్పీకర్ తమ్మినేని సీతారాంకు విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఆమదాలవలసలో స్పీకర్ నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం నిలిపివేశారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. తమ సమస్యలపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయి నోటిఫై జరిగేంతవరకు, మునుపటి లాగా తమకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ శాఖ ద్వారా మంజూరు జరిగేలా చొరవ చూపాలని సభాపతికి విన్నవించారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు పాలవలస సర్పంచ్ గజ్జన మోహన్ రావు, పెద్దపాలెం సర్పంచ్ సర్దార్ గురువుల నాయుడు, గద్ది ప్రసాదు, మురళీ ప్రసాద్, శంకరా రవు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి విద్యార్థి బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి


బ్లడ్‌గ్రూపు కార్డులను విద్యార్థులకు అందజేస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం కల్చరల్:** ప్రతి విద్యార్థి తన బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు అన్నారు. బ్లడ్ గ్రూపు తెలుసుకుంటే ఆపద సమయంలో సులువుగా ఆ గ్రూపు రక్తాన్ని అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. స్థానిక మహిళా జూనియర్ కళాశాలలో బ్లడ్ గ్రూప్ తెలియచేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు, ఐటీఐల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల బ్లడ్ గ్రూప్‌లను తెలియజేస్తున్నామన్నారు.

అర్హత ఉండి బ్లడ్ గ్రూప్ తెలిసినవారు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, రెడ్‌క్రాస్ సిబ్బంది కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, సుజాత, పవన్‌కుమార్ పాల్గొన్నారు.